సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేల ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.



టమాట కిలో రూ.14
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.4, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
36.5°/14.1°
జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

ప్రశాంతి నిలయం: ఆహారశుద్ధి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, డ్వాక్రా మహిళా సంఘాలకు ప్రోత్సాహక రాయితీలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లా ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు 40 ఆహారశుద్ధి పరిశ్రమలకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు విలువలో లబ్ధిదారులు 10 శాతం భరిస్తే, 35 శాతం ప్రభుత్వం రాయితీ ఉంటుందని, మిగతా 55 శాతం బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామన్నారు. గరిష్టంగా రూ.10 లక్షల వరకు రాయితీలు ఉంటాయన్నారు. జిల్లాలో వేరుశనగ నూనె, చిక్కీల తయారీ, పొటాటో చిప్స్, చెక్కిలాలు, ఊరగాయలు, రోటీ మేకర్, రెడీ టు ఈట్ ప్రొడక్ట్స్, శనగపప్పు, బేకరీ, మిల్లెట్ ఆధారిత ప్రొడక్ట్స్, బొరుగుల, రైస్ బేసిడ్ ప్రొడక్ట్స్, బొరుగులు బట్టి, చింతపండు పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. అర్హత , ఆసక్తి ఉన్న వారు ఈనెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9676796974 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎరువుల సమస్య తలెత్తనివ్వం



ఎరువులు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణా రెడ్డి

కొత్తచెరువు: రబీ సీజన్‌లో పంటల సాగు చేసే రైతులకు ఎరువుల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కొత్తచెరువులోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. యూరియాకు ఎక్కువ డిమాండ్ ఉండటంతో అక్కడి నుంచే ఫోన్‌లో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సరిపడినంత యూరియాను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగులో రైతులకు కావాల్సిన సకలం స్థానికంగానే అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో బోరుబావులు, చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉండటం వల్ల రైతులంతా పంటల సాగుకు సిద్ధమయ్యారన్నారు. అందువల్ల ఈ సారి సాగు విస్తీర్ణం కూడా పెరిగిందన్నారు. అయినప్పటికీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు, పరికరాలను అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఓ నటరాజ్, ఏఈఓ ఉపేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, వాల్మీకి శంకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో విద్యార్థులకు తీవ్ర గాయాలు



తేనెటీగల దాడిలో గాయపడిన విద్యార్థులకు చికిత్స అందిస్తున్న వైద్యుడు

గోరంట్ల: తేనెటీగల దాడిలో ఇద్దరు విద్యార్థులు, మరికొందరు స్థానికులు గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం గోరంట్లలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గోరంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని చెట్లలో ఉన్న తేనెటీగలు సాయంత్రం ఒక్కసారిగా పైకి లేచాయి. అటుగా వెళుతున్న అబ్దుల్ రహిమాన్, ప్రవీణ్ అనే విద్యార్థులను చుట్టుముట్టి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే స్పందించిన స్థానికులు సమీపంలోని నీటి గుంటలోకి దించి విద్యార్థులను కాపాడారు. అనంతరం వారిని గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా..తేనెటీగలు దాడిలో పదిమంది దాకా స్థానికులు కూడా స్వల్పంగా గాయపడ్డారు.

బియ్యం దందాకు రాచమార్గం

పేదల కడుపునింపాల్సిన రేషన్ బియ్యం పచ్చనేతల జేబులు నింపుతున్నాయి. 'మామూళ్ల'తో సరిహద్దు దాటి... సన్నగా మారిపోతున్నాయి. ధర పెరిగి మళ్లీ పేదల కంచంలోకే చేరుతున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన కొందరు అధికారుల అండతో జాతీయ రహదారిపైనే జిల్లా సరిహద్దు దాటుతున్నాయి. కొందరు నేతలు సిండికేట్‌గా మారిసాగిస్తున్న దందాతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతుండగా...అంతిమంగా నష్టపోతున్నది నిరుపేదలే.

- టీడీపీ నేతల సిండి'కేటు' వ్యవహారం
- జిల్లాలో ఆగని రేషన్ బియ్యం అక్రమ రవాణా
- జాతీయ రహదారి మీదుగా బెంగళూరుకు సరఫరా
- యథేచ్ఛగా సరిహద్దులు దాటిస్తున్న దళారులు



సోమందేపల్లి మండలం కొలిమిపల్లి గ్రామంలో టీడీపీ నేత శంకర్‌రెడ్డి ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: అక్రమ రవాణాకు పెనుకొండ జాతీయ రహదారి రాచమార్గంగా మారింది. అడిగేవారు లేకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు టీడీపీ నేతలు సిండికేటుగా ఏర్పడి.. అక్కడక్కడా ఏజెంట్లను పెట్టుకుని కమీషన్లు అందజేస్తూ రేషన్ బియ్యాన్ని సరిహద్దు దాటిస్తున్నట్లు సమాచారం. ఫలితంగా పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న చౌక బియ్యం.. కొందరు పెద్దలకు భోజ్యంగా మారాయి.

జాతీయ రహదారిపైనే అక్రమ దందా..

రేషన్ బియ్యం ముఠా ఎక్కువగా నల్లమాడ, ఓడీ చెరువు తదితర ప్రాంతాల్లో బియ్యం సేకరించి.. అక్కడి నుంచి కొత్తచెరువు మీదుగా గోరంట్ల, పెనుకొండ మార్గాల్లో జాతీయ రహదారికి చేరుస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో సరుకు రాత్రికి రాత్రే బెంగళూరు చేరుతోంది. అదేవిధంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన రామగిరి, చిలమత్తూరు, హిందూపురం, అమడగూరు తదితర ప్రాంతాల నుంచి కూడా రేషన్ బియ్యం సేకరించి.. గుట్టు చప్పుడు కాకుండా కర్ణాటకకు తరలిస్తున్నారు.

కిలో రూ.10లకు కొని రూ.50కి విక్రయం..

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన చౌక బియ్యం కర్ణాటక రాజధాని బెంగళూరుకు చేరుస్తారు. అక్కడ పాలిష్ చేసి సన్నబియ్యంగా మార్చి మళ్లీ జిల్లాలోని కిరాణా దుకాణాలకు కొన్ని, విదేశాలకు మరికొన్ని తరలిస్తున్నట్లు సమాచారం. పేదలకు ఉచితంగా అందుతోన్న బియ్యాన్ని కిలో రూ.10 ప్రకారం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు చేసి పాలిష్ తర్వాత కేజీ రూ.50 వరకు విక్రయాలు చేస్తున్నట్లు తెలిసింది. గత టీడీపీ ప్రభుత్వంలో అలవాటు పడిన 'తమ్ముళ్లు' అక్రమార్జనే ధ్యేయంగా దొడ్డిదారిన వ్యాపారం చేస్తున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

పోలీసుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో.. అక్రమ మార్గంలో చౌక బియ్యం హద్దు దాటుతోంది. మామూళ్ల మత్తులో పోలీసులు మొద్దు నిద్రలో ఉండటంతో అక్రమార్కుల హవా నడుస్తోందని సమాచారం. జిల్లా ఏర్పడిన నాటి నుంచి పెనుకొండ, గోరంట్లలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం గమనార్హం. ఆయా ప్రాంతాల్లో టీడీపీ నేతలు మామూళ్ల పేరుతో అధికారులు, పోలీసులను నియంత్రిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మిగతా ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం పట్టివేత కేసుల వివరాలు (2022 ఏప్రిల్ నుంచి 2023 జనవరి వరకు)

- సోమందేపల్లిలో మూడు కేసులు నమోదు, ఆరుగురు అరెస్టు, 15 టన్నుల బియ్యం సీజ్ చేశారు.
- రొద్దంలో మూడు కేసులు నమోదు కాగా, ఆరుగురు అరెస్టయ్యారు. ఏడు టన్నుల బియ్యం సీజ్.
- 'కియా' పోలీసులు రెండు కేసులు నమోదు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. 36 టన్నుల బియ్యం పట్టుకున్నారు.
- మడకశిర పోలీసులు మూడు కేసుల్లో 9 మందిని అరెస్టు చేశారు. 586.9 టన్నుల బియ్యం సీజ్ చేసినట్లు పెనుకొండ సబ్ డివిజన్ రికార్డుల ద్వారా తెలుస్తోంది.
- అమరాపురం, అగళిలో ఒక్కో కేసు చొప్పున జిల్లా ఏర్పడిన నాటి నుంచి పెనుకొండ సబ్ డివిజన్‌లో 13 కేసుల్లో 13 వాహనాలను సీజ్ చేశారు.

విస్తృతంగా దాడులు



జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలను అరికట్టేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా దాడులు నిర్వహిస్తాం. నిఘా వర్గాలను పెంచుతున్నాం.
– పీజీ వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి

వదిలేది లేదు



రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని వదిలేది లేదు. కొత్తచెరువు మీదుగా గోరంట్ల, పెనుకొండకు తరలివెళ్తున్న చాలా వాహనాలను పట్టుకున్నాం. కేసులు నమోదు చేశాం. నిందితులను అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేశాం. ప్రజలు సహకరిస్తే అరికట్టడం సాధ్యం అవుతుంది.
– హుస్సేన్‌పీరా, డీఎస్పీ, పెనుకొండ

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచే చర్యలపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: రైతులకు పెట్టుబడులు తగ్గి లాభాలు చేకూర్చే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దామని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఆయన తన ఛాంబర్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గోఆధారిత ప్రకృతి వ్యవసాయం, గోసంరక్షణను ప్రోత్సహిస్తోందని చెప్పారు. అలాగే అన్నప్రసాదాల తయారీకి ప్రకృతి సేద్యం ద్వారా పండిన ఉత్పత్తులను సేకరించేందుకు సిద్ధమైందన్నారు. ఈ క్రమంలోనే జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే వేరుశనగ, వరి, శనగ, కంది వంటి ఉత్పత్తులకు టీటీడీ గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తుందన్నారు. అందువల్లే ఈసారి ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. నిష్ణాతులైన రైతులకు శిక్షణ కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి గీతమ్మ, డీఏఓ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డీపీఎం లక్ష్మానాయక్, డీసీఓ కృష్ణానాయక్, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు జీ–20 ప్రతినిధుల బృందం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, అధికారులు



విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం

పుట్టపర్తి అర్బన్: జీ–20 ప్రతినిధుల బృందం మంగళవారం రానున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జీ–20 దేశాలకు చెందిన ఎనర్జీ ట్రాన్సిషన్ వర్కింగ్ గ్రూప్(ఈటీడబ్ల్యూజీ) సభ్యులు జిల్లాలోని కొడికొండ, చిలమత్తూరు మీదుగా పావగడ వెళ్లి అక్కడ సోలార్ పార్కును సందర్శిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు తిరుగు ప్రయాణంలో లేపాక్షి ఆలయాన్ని సందర్శిస్తారని వివరించారు.

వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

లేపాక్షి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయం విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతోంది. జీ–20 సమ్మిట్ కోసం బెంగళూరు వస్తున్న 20 దేశాలకు చెందిన 60 మంది ప్రతినిధులు మంగళవారం సాయంత్రం లేపాక్షికి విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. సోమవారం సాయంత్రం పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తిక్‌తో పాటు కదిరి, పుట్టపర్తి డీఎస్పీలు భవ్యకిశోర్, యశ్వంత్ ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ బందోస్తు ఏర్పాట్లపై ఆరా తీశారు. అదేవిధంగా పురావవస్తు శాఖ సహాయ సంచాలకులు గోపినాథ్‌జాన, సీఏ బాలకృష్ణారెడ్డి కూడా ఆలయ ప్రాంగణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కిందస్థాయి సిబ్బందికి సూచించారు. అనంతరం ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్ వద్ద డీఎస్పీలు పోలీసులతో సమీక్షించారు. జీ–20 సమ్మిట్ బృందం బందోబస్తు కోసం సుమారు 400 మంది పోలీసులను నియమించామన్నారు.

అర్జీదారుల నమ్మకాన్ని నిలబెడదాం

- కలెక్టర్ బసంత్‌కుమార్ పిలుపు

పుట్టపర్తి అర్బన్: ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపి 'స్పందన'పై అర్జీలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడదామని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమానికి ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై అర్జీలిస్తున్నారని, వారి నమ్మకం వమ్ముకాకుండా పనిచేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యాన్ని సహించబోనని ఆయన హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 173 అర్జీలు అందాయి. కలెక్టర్ ప్రతి అర్జీదారునితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్నింటిపై అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...'స్పందన' అర్జీలన్నీ ఎప్పటికప్పుడు నాణ్యంగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ అనే మాట వినపడకుండా చూడాల్సిన భాధ్యత అందరిపైనా ఉందన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని ఇలా...

- తాము అమరాపురం మండలం బసవన్నపల్లి పొలం సర్వే నంబర్ 420–4లో ఎకరా భూమి కొనుగోలు చేశామని, అయితే వీఆర్ఓ, తహసీల్దార్ పట్టాదార్ పాస్ పుస్తకం, 1–బీ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తుముకూరు జిల్లా పావగడ తాలూకలోని కెంచమ్మనహళ్లికి చెందిన లక్ష్మమ్మకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- 90 శాతం వైకల్యం ఉన్న తనకు మూడు చక్రాల సైకిల్ మంజూరు చేయాలని హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లికి చెందిన గంగరాజు కలెక్టర్‌కు విన్నవించారు.
- తనకు పూర్వీకుల ద్వారా సంక్రమించిన సర్వే నంబర్ 164లోని రెండెకరాల భూమికి ఇతర వ్యక్తులు పట్టాదార్ పాస్ పుస్తకం చేయించుకున్నారని, దాన్ని రద్దు చేసి తనకు న్యాయం చేయాలని సోమందేపల్లి మండలం మాగే చెరువు గ్రామానికి చెందిన సుబ్బలక్ష్మమ్మ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలతో పాటు జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో ఏ రోజుకా రోజు పురోగతి కనిపించాలన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లోని గృహ నిర్మాణ పనులు, జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు, నాడు–నేడు, ఆధార్ అప్‌డేట్, ముఖ ఆధారిత హాజరు తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లుతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయించాలన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. నాడు–నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయించాలన్నారు. అలాగే మంగళవారం డివిజన్, మండల కేంద్రాలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఆధార్ నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు తెలిపి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

15న సమీర్ శర్మ రాక

ఈనెల 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్‌శర్మ జిల్లా వస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఆ రోజు వివిధ శాఖల అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. అందరూ సమగ్ర నివేదికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే ముఖ ఆధారిత హాజరు వందశాతం నమోదు కావాలన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం ఉద్యోగులు యాప్‌లో ఎన్‌రోల్ చేసుకోలేదన్నారు. వెంటనే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని హాజరు వేయాలన్నారు.

మీవల్లే నేను మాటలు పడాల్సి వచ్చింది



సిలబస్ గురించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి

- పాఠశాల నిర్వహణ ఇలాగేనా ఉండేది
- సిలబస్ పూర్తి చేయకుండా పరీక్షలు ఎలా పెడతారు?
- లేపాక్షి వివేకానంద జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్లపై ఇన్‌చార్జ్ డీఈఓ ఆగ్రహం

లేపాక్షి: "జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించలేదు. సిలబస్ పూర్తి చేయకుండానే సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించారు. మీరు చేసిన తప్పులకు నేను మాటలు పడాల్సి వచ్చింది. అసలు పాఠాలు చెప్పకుండానే పరీక్షలు పెడితే విద్యార్థులు ఎలా రాస్తారు" అని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి లేపాక్షిలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఆమె పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 3వ తేదీ రాత్రి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్‌ప్రకాష్ వివేకానంద జెడ్పీ పాఠశాల ఆవరణలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించగా... సిలబస్ పూర్తి చేయకుండానే సమ్మేటివ్–1 పరీక్ష నిర్వహించినట్టు గుర్తించారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన... పాఠశాలను తనిఖీ చేసి నివేదికను ఇవ్వాలని ఇన్‌చార్జ్ డీఈఓను ఆదేశించారు. దీంతో ఆమె సోమవారం పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, జవాబు పత్రాల మూల్యాంకనం, మధ్యాహ్న భోజనం రికార్డులు పరిశీలించారు. ఒక్క రికార్డు కూడా సక్రమంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. నిర్ణీత సమయంలో సిలబస్ ఎందుకు పూర్తి చేయలేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయుడు తరుచూ ఆన్ డ్యూటీ(ఓడీ)పై వెళ్లడాన్ని ఆమె తప్పుపట్టారు. అలాగే ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్టు గుర్తించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...పాఠశాలలో తాను గమనించిన విషయాలపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఆమె వెంట డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓ నాగరాజు ఉన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



జింకను పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వాహనం ఢీకొని జింక మృతి చెందింది. వివరాల్లోకి వెళితే ...సోమవారం సాయంత్రం వేళ రోడ్డుపై వెళ్తున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. విషయం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని జింకను రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకపోకపోవడంతో మృతి చెందింది.

వేరుశనగకు రూ.32 వేల రుణం

- మార్చి 31లోపు రుణాలు రెన్యూవల్ చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ఎకరాకు జిల్లా సహకార బ్యాంకు ద్వారా రూ.32 వేల వరకూ రుణం అందించనున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన తన ఛాంబర్‌లో జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ లిఖిత, సీఈఓ రాంప్రసాద్, డీజీఎం సుఖ్‌దేవ్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ సహకార బ్యాంకుల ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. వేరుశనగతో పాటు ఇతర పంటలకూ రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది బ్యాంకు ద్వారా ఇచ్చిన పంట రుణాలు, చెల్లింపులు, రెన్యూవల్స్ తదితర అంశాలపై చర్చించారు. మార్చి 31లోపు రైతుల పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అప్పుడే ప్రభుత్వం అందించే పావలా వడ్డీ, సున్నా వడ్డీ తదితర ప్రోత్సాహకాలు అందే వీలుందన్నారు. కార్యక్రమంలో లోన్స్ మేనేజర్ ప్రసాద్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

క్లుప్తంగా

సెల్‌ఫోన్ల రికవరీ.. సంబంధీకులకు అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: చాట్‌బాట్ సేవల ద్వారా రికవరీ చేసిన 21 సెల్‌ఫోన్లను సంబంధీకులకు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ సోమవారం అందజేశారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారు చాట్‌బాట్ సేవలకు ఫిర్యాదు చేయడం ద్వారా వాటి రికవరీ సాధ్యమైనట్లుగా ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.3.5 లక్షలు విలువ ఉంటుందన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే 63058 00426 వాట్సాప్ నంబర్‌కు వివరాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, క్యాట్ సిబ్బంది రవి, శ్రీనివాస్, చంద్రశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హిందూపురం: స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కొట్నూరు పొలాల్లో 45 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. మరువ పారే ఏటిగడ్డ పక్కన చిన్న గుంతలో మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు. సిమెంట్ కలర్ బనియన్, సిమెంట్ కలర్ జీన్స్‌ప్యాంట్ వేశాడని, వస్త్రాధారణను బట్టి మృతుడిని ముస్లింగా అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

రైలు పట్టాలపై మరో గుర్తు తెలియని ..

కొత్తచెరువు: మండలంలోని నారాయణపురం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల పక్కన సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. నలుపు, పసుపు రంగు గల పుల్ షర్టు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి దుర్మరణం



మృతురాలు ధ్యానీబాయి

పెనుకొండ: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ మండలం కొండంపల్లికి చెందిన ధ్యానీబాయి (75) పెనుకొండ రైల్వే గేటు సమీపంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సోమవారం రైల్వే గేటు వద్ద భిక్షాటన చేస్తుండగా వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ధ్యానీబాయి అక్కడికక్కడే మృతి చెందింది. పెనుకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తుది పోరుకు 'ఎస్‌పీఎల్'



బాలాజీ కళాశాల జట్టు క్రీడాకారుడిని బౌల్డ్ చేసిన ఆర్ట్స్ కళాశాల బౌలర్



ఫైనల్‌కు చేరుకున్న అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల జట్టు



ఫైనల్‌కు చేరుకున్న ఆర్ట్స్ కళాశాల జట్టు

- నేడు తలపడనున్న ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి జట్లు

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా యాజమాన్యం ఆధ్వర్యంలో అనంత క్రీడా గ్రామం వేదికగా మూడు ప్రధాన మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు మూడో రోజు సోమవారమూ ఉత్కంఠగా సాగాయి. మంగళవారం జరిగే ఫైనల్స్‌లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడనున్నాయి.

మ్యాచ్‌ల వివరాలు..

విన్సెంట్ క్రీడా మైదానంలో నిర్వహించిన చివరి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఎంజేఎల్ (కదిరి), అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల (అనంతపురం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఎస్ఎంజేఎల్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. జట్టులో రాజశేఖర్ 13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 33 పరుగులు, షాకీర్ 24 బంతుల్లో 2 ఫోర్లతో 18 పరుగులు సాధించారు. ఎస్ఎంజేఎల్ బౌలర్లలో వేణు 3, వెంకటేష్‌నాయక్, రాజశేఖర్ చెరో 2 వికెట్లను సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్ఎంజేఎల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 49 పరుగులు చేసింది. జట్టులో రాజశేఖర్ 18 బంతుల్లో 4 ఫోర్లతో 20 పరుగులు సాధించాడు. అనంతలక్ష్మి బౌలర్లలో శ్యాం 3, రాజేష్ 2 వికెట్లు సాధించారు. 29 పరుగులతో అనంతలక్ష్మి జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది.

- తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల, శ్రీబాలాజి కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆర్ట్స్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీబాలాజి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 66 పరుగులు సాధించింది. ఆర్ట్స్ కళాశాల బౌలర్లలో వినయ్ 3, భార్గవ్ 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు 7.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో శ్రీకాంత్ 19 బంతుల్లో 5 ఫోర్లతో 28 పరుగులు సాధించాడు. 7 వికెట్ల తేడాతో విజయం సాధించి ఆర్ట్స్ కళాశాల జట్టు ఫైనల్‌కు చేరుకుంది.
- రెండో సెమీస్ మ్యాచ్‌లో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఎస్‌జీఎస్ (గుంతకల్లు) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి అనంతలక్ష్మి జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా తొలుత బ్యాటింగ్ చేసిన గుంతకల్లు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. జట్టులో తౌసిఫ్ 28 బంతుల్లో 5 ఫోర్లతో 42, భువన్ 22 బంతుల్లో 2 ఫోర్లతో 26 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు 9.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో రాజశేఖర్ 17 బంతుల్లో 5 ఫోర్లతో 36 పరుగులు, షాకీర్ 10 బంతుల్లో 3 సిక్సర్లతో 23 పరుగులు సాధించారు. 7 వికెట్ల తేడాతో విజయం సాధించి అనంతలక్ష్మి జట్టు ఫైనల్‌కు చేరుకుంది.

నేడు ఫైనల్స్..

జూనియర్ విభాగంలో సాయి విజ్ఞాన్ జూనియర్ కళాశాల (అనంతపురం), ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆత్మకూరు) జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను అనంత క్రీడా గ్రామంలోని విన్సెంట్ క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నారు. అలాగే సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌ను మధ్యాహ్నం 1 గంటకు ఆర్ట్స్ కళాశాల, అనంతలక్ష్మి జట్ల మధ్య నిర్వహించనున్నారు.

యువకుడిపై దాడి



గాయపడ్డ చిరంజీవి

ధర్మవరం అర్బన్: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై మరి కొందరు దాడి చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో ఆదివారం రాత్రి చిరంజీవి, రమణారెడ్డి ఘర్షణ పడ్డారు. దీంతో కక్ష పెంచుకున్న రమణారెడ్డి సోమవారం తన స్నేహితులు తిరుపాలు, నాగేంద్రతో కలసి ధర్మవరంలోని ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న చిరంజీవిపై కర్రలతో దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన చిరంజీవిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు హరికృష్ణ

గోరంట్ల: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం బెల్లాలచెరువు సమీపంలో నందిని వేర్‌హౌస్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. బాపట్ల జిల్లా జంపని గ్రామానికి చెందిన వెల్డర్ హరికృష్ణ (33) సోమవారం ఉదయం గోదాము పైకప్పు రేకులు బిగించే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో డ్రిల్ మిషన్‌తో రేకులు బిగిస్తుండగా మిషన్‌కున్న వైర్ తెగి రేకులకు విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

బడ్జెట్ రూపకల్పనలో జెడ్పీ అధికారులు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ రూపకల్పనలో జిల్లా పరిషత్ అధికారులు బిజీ అయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశాల మేరకు సీఈఓ కె.భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, గణాంకాధికారి అమృత్‌రాజ్ ఆధ్వర్యంలో బడ్జెట్ రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించి జెడ్పీ సహా అనుబంధ శాఖల నుంచి సమగ్ర వివరాలు తెప్పించుకొని వాటిని క్రోడీకరించుకున్న తరువాత వచ్చే నెలలో జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. అనంతపురంలో ఒక్క ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ మినహా మిగిలిన అన్ని శాఖల నుంచి సమాచారం తెప్పించుకున్నట్లు డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బడ్జెట్ పంపడంలో ఆలస్యమైంది. ఆ శాఖ వివరాలు రాగానే పూర్తి స్థాయిలో బడ్జెట్ రూపుదిద్దుకోనుంది.

కనుమరుగవుతున్న ఖరము

- క్రమేణా తగ్గిపోతున్న సంఖ్య
- నాడు.. 15వేలు.. నేడు వెయ్యిలోపే
- గాడిదల సంతతి పెంపునకు ప్రభుత్వాల యాక్షన్ ప్లాన్

అనంతపురం అగ్రికల్చర్: సంఘజీవి, కష్టజీవి అయిన గాడిద (ఖరము) క్రమేణా కనుమరుగవుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు మానవుని జీవన శైలిలో మార్పులు వచ్చాక గాడిదల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇదే పరిస్థితి మరికొన్ని సంవత్సరాలు కొనసాగితే భూమి మీద గాడిద జాతి అంతరించిపోయే ప్రమాదం ఉంది. దీంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి... వీటి సంతతిని పెంచాలని వార్షిక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

- గాడిద జీవితకాలం 50 సంవత్సరాలు. గ్రామీణ ప్రాంతాల్లో బరువు మోయడానికి వినియోగిస్తారు. చాకలివారు తమ వృత్తి పనిలో వీటినే ఎక్కువగా వాడేవారు. కొండలు, గుట్టలు లాంటి ప్రాంతాల్లో నివసించే వారు రవాణాకు, మరికొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనుల్లో కూడా వినియోగించేవారు. లగేజీ రవాణాకు ఆటోలు, తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాలు అందుబాటులోకి రావడంతో గాడిదల వినియోగం తగ్గిపోయింది. 30 ఏళ్ల కిందట వరకు గాడిదల సంఖ్య గణనీయంగా ఉండేది. పల్లెల్లో చూస్తే ఎక్కడ చూసినా కనిపించేవి. గాడిద పాలను పిల్లలకు రోగనిరోధక శక్తిగానూ, కొన్ని ఆయుర్వేద మందుల్లోను వాడతారు. అక్కడక్కడా ఉన్న గాడిదల నుంచి కొందరు పాలను సేకరించి అమ్ముకుంటున్నారు. ఇప్పుడు వాటి పాలకు గిరాకీ ఉన్నందున గాడిద కూడా కొందరికి జీవనాధారంగా మారింది.



వెయ్యిలోపే గాడిదలు

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 2007 లెక్కల ప్రకారం 15 వేలకు పైగా గాడిదలు ఉండేవి. 2012లో ఆ సంఖ్య 6,800కు చేరగా, 2018లో 3,200కు పడిపోయింది. తాజాగా గాడిదల సంఖ్య వెయ్యికి లోపే ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో రొళ్ల, శెట్టూరు, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, యాడికి, పెద్దవడుగూరు, గుంతకల్లు, గుత్తి, ధర్మవరం, కూడేరు, కుందుర్పి, అమరాపురం, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో గాడిదలు సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

గాడిదల పెంపకంపై 23న సదస్సు

అంతరించిపోతున్న గాడిదల సంతతిని పెంచాలనే ఆలోచనతో ఈ నెల 23న అనంతపురంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'బ్రూక్ హాస్పిటల్' ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ సహకారంతో 'డీక్లినింగ్ డాంకీ పాపులేషన్ అండ్ స్టెప్స్ ఫర్ మిటిగేషన్ ఇన్ ది స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం, బ్రూక్ హాస్పిటల్ ప్రతినిధులతో పాటు పశు సంవర్ధక శాఖ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, నోడల్ ఆఫీసర్లు, అనిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు, గుంటూరుకు చెందిన గాడిద పెంపకందారులు కొందరు హాజరు కానున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

దొంగకు ఖాకీ మద్దతా?

- 9 నెలలుగా చోరీ కేసు ఛేదించకుండా నిర్లక్ష్యం వహించారు
- స్టేషన్‌కెళ్లి మాట్లాడితే దుర్భాషలాడుతున్నారు
- పుట్టపర్తి సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి తీరుపై 'స్పందన'లో ఫిర్యాదు



ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న హోంగార్డు లక్ష్మణ నాయక్

సాక్షి, పుట్టపర్తి: 'నా ఇంట్లో చోరీ జరిగి 9 నెలలవుతోంది. 20 తులాల బంగారాన్ని అపహరించుకెళ్లారు. ఈ సొత్తు రికవరీలో ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న హోంగార్డు నాగరాజు నాయక్.. పుట్టపర్తి సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నేను ఎన్నిసార్లు స్టేషన్‌కెళ్లి సీఐను కలిసినా ఫలితం లేకుండా పోతోంది. పైగా నన్నే దుర్భాషలాడుతూ కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి. నాకు న్యాయం చేయాలి' అంటూ ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్ ఎదుట హోంగార్డు లక్ష్మణ నాయక్ వాపోయాడు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఏఎస్పీని కలసి అర్జీ అందజేసి, మాట్లాడారు.

- పుట్టపర్తిలోని శిల్పారామం సమీపంలో నివాసముంటున్న లక్ష్మణ నాయక్ ఇంట్లో 2022, జూన్ 14న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు చోరీ జరిగింది. 20 తులాల బంగారం, రూ.11 వేలను అపహరించుకెళ్లారు. గోకులం ప్రాంతానికి చెందిన కాటమయ్య, హోంగార్డు నాగరాజు నాయక్‌ను అనుమానితులగా పేర్కొంటూ అప్పట్లో పుట్టపర్తి అర్బన్ పోలీసులకు లక్ష్మణ నాయక్ ఫిర్యాదు చేశాడు. నాగరాజు నాయక్‌పై గతంలోనూ చోరీ కేసులున్నాయని అందులో గుర్తు చేశాడు. బైక్ చోరీ కేసులో పట్టుబడి జైలు జీవితం అనుభవించి వచ్చిన నాగరాజు నాయక్‌ను పుట్టపర్తి సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి చేరదీసి డ్రైవర్‌గా పెట్టుకున్నారని వివరించాడు. ఈ క్రమంలో కేసు దర్యాప్తులో అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తున్నారని బాధితుడు వాపోయాడు. చోరీ సొత్తు రికవరీ చేసివ్వాలంటూ స్టేషన్‌కెళ్లి అడిగితే దుర్భాషలాడుతున్నారని వాపోయాడు. పైగా 'ఎమ్మెల్యేతో ఫోన్‌చేయిస్తే బంగారాన్ని రికవరీ చేయాలా? నా దగ్గర పనిచేసే డ్రైవర్ దొంగతనం ఎందుకు చేస్తాడు? ఇంకోసారి స్టేషన్‌కు వస్తే బాగుండదు. నీ ఉద్యోగం ఊడగొట్టిస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయాడు. ఉన్నతాధికారులైనా న్యాయం చేయాలని కోరాడు.

63 వినతులు..

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 63 వినతులు అందాయి. తొలుత ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్ అర్జీలు స్వీకరించి, పరిశీలించారు. అనంతరం ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ చేరుకుని అర్జీదారులతో మాట్లాడి సమస్య తీవ్రతపై ఆరా తీశారు. చట్ట పరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు.

'పురం'లో ఆర్ఏఎఫ్ దళం



హిందూపురంలో కవాతు చేస్తున్న ఆర్ఏఎఫ్ దళం

హిందూపురం: సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత పర్యవేక్షణ అంశంపై క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా హకీంపేట్ 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సిబ్బంది సోమవారం హిందూపురానికి చేరుకుంది. ఇందులో భాగంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి సద్భావనసర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఎంఎఫ్ రోడ్, వాసవీ ధర్మశాల, రహమత్‌పురం సర్కిల్, నానెప్పనగర్, ధర్మపురం, బాలాజీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కవాతు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, అసిస్టెంట్ కమాండెంట్ సతీష్, రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు బాధాకరం



మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలసి మాట్లాడుతున్న నర్సులు

హిందూపురం: రోగులకు విలువైన సేవలను నిస్వార్థంతో అందజేస్తున్న నర్సుల పట్ల హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఆస్పత్రి నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలకృష్ణ తన వ్యక్తిగత టీవీ షోలో నర్సుల గురించి చేసిన వ్యాఖ్యలు వివాదానికి తెర లేపిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం పలువురు నర్సులు చైర్‌పర్సన్‌తో కలసి మాట్లాడారు. బాలకృష్ణకు పెద్దలు, మహిళ పట్ల ఏమాత్రం గౌరవం లేదని మరోసారి రుజువైందన్నారు. నర్సులకు బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- బీసీ సంక్షేమ సహాయ అధికారి నాగేంద్రరాజు

నల్లమాడ: వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వసతిగృహాల సంక్షేమ అధికారులు, ట్యూటర్లను హిందూపురం డివిజన్ బీసీ సంక్షేమ సహాయ అధికారి ఆర్.నాగేంద్రరాజు ఆదేశించారు. సోమవారం ఆయన నల్లమాడ, రెడ్డిపల్లి బీసీ వసతిగృహాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలిచ్చారు. వసతిగృహాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు కనుమేనాయక్, శంకర, సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మడకశిర: మడకశిరలో సోమవారం ఉదయం అక్రమంగా ఐచర్ వాహనంలో తరలిస్తున్న 165 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు అప్రమత్తమైన విజిలెన్స్ సీఐ రామారావు ఏఓ వాసుప్రకాష్, సీఎస్‌డీటీ ఆరతి సోమవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుంచి వస్తున్న ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 165 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వాహన యజమానితో పాటు బియ్యం తరలింపుదారుపై కేసు నమోదు చేశారు.

మరో 280 బస్తాల బియ్యం పట్టివేత..

మడకశిరలో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో అక్రమంగా కర్ణాటకలోని తుమకూరుకు తరలిస్తున్న 280 రేషన్ బియ్యం బస్తాలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణదుర్గం ప్రాంతం నుంచి ఐచర్ వాహనంలో బియ్యం తరలిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది. వాహనాన్ని సీజ్ చేసి, స్థానిక పోలీసులకు అప్పగించారు.

శుభ తరుణంలో విషాదం

- గుండెపోటుతో యువకుడి మృతి
- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పరామర్శ



కిషన్‌చౌదరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



కిషన్‌చౌదరి (ఫైల్)

బత్తలపల్లి: డిగ్రీ పూర్తి చేసుకుని సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకునేందుకు సంతోషంగా బయలుదేరిన ఓ యువకుడు గుండెపోటుతో అకాల మృత్యువాత పడ్డాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన చల్లా రంగానాయుడు, రత్నమ్మ దంపతుల కుమారుడు కిషన్ చౌదరి (23) డిగ్రీ పూర్తి చేసుకుని బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున అనంతపురం నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు సిద్ధమైన కిషన్‌చౌదరికి ఆదివారం వేకువజాము 2 గంటలకు ఫిట్స్ వచ్చాయి. గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతుడికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, అప్పరాచెరువు ఈశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు చల్లా శ్రీరాములు, చల్లా క్రిష్ణమనాయుడు, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల కన్వీనర్లు బగ్గిరి బయపరెడ్డి, ఇందుకూరు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.